JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజ్‌గిరి | సోమవారం 20-04-2026
Medchal - Malkajgiri | Monday 20-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 323
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 323 | Pages : 8 | ₹: 5






# ఏప్రిల్ 29 లోపు లొంగిపోండి

- లేదంటే మిమ్మల్ని వదిలిపెట్టము
- టీఎంసీ గూండాలకు మోదీ సీరియస్ వార్నింగ్

జయభేరి, న్యూఢిల్లీ :

పశ్చిమ బెంగాల్‌లోని బాంకురాలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తృణమూల్ కాంగ్రెస్ (TMC) ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలోని గూండాలు, అవినీతిపరులకు ప్రధాని మోదీ గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఏప్రిల్ 29వ తేదీ లోపు సమీప పోలీస్ స్టేషన్లలో లొంగిపోవాలని, లేదంటే మే 4వ తేదీ తర్వాత ఎవరినీ వదిలిపెట్టబోమని అల్టిమేటం ఇచ్చారు. బిష్ణుపూర్ మాఫియా, టీఎంసీ సిండికేట్ సభ్యులు ఇకపై తమ ఆటలు సాగవని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. టీఎంసీ నేతల బెదిరింపులు చూస్తుంటే ఎన్నికలకు ముందే వారి ఓటమి ఖాయమైందని అర్థమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని మహిళలకు టీఎంసీ ద్రోహం చేస్తోందని, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుని వారి హక్కులను కాలరాస్తోందని ఆయన మండిపడ్డారు. చొరబాటుదారుల కోసం నిబంధనలు ఉల్లంఘించే టీఎంసీ, రాజ్యాంగ విరుద్ధంగా మతపరమైన రిజర్వేషన్లను ప్రోత్సహిస్తోందని ...మిగతాది 2 లో

# ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణం

- సంవత్సరం పాటూ.. తెలంగాణ ప్రభుత్వం అదిరిపోయే ప్లాన్
- ఎలా అమలవుతుంది ఈ పథకం? ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుంది?
- జూన్ 2 నుంచి ఏడాది పాటు ప్రయోగం విజయవంతమైతే ఉచిత ప్రయాణం శాశ్వతంగా కొనసాగే అవకాశం

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ వాసులకు అదిరిపోయే శుభవార్త! రోజూ ఆఫీసు, కాలేజీ, మార్కెట్ ప్రయాణాలకు ఎంతో ఖర్చు చేస్తున్న మధ్య తరగతి, సామాన్యులకు ఊరట కలిగించేలా తెలంగాణ ప్రభుత్వం ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణం పథకానికి సన్నాహాలు చేస్తోంది. తెలంగాణ ఆవిర్భావ దినం జూన్ 2 నుంచి ఏడాది పాటు ప్రయోగాత్మకంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఫలితాలను బట్టి ఆ తర్వాత కొనసాగించాలా లేదా అని నిర్ణయం తీసుకోనుంది. ఈ ప్రతిపాదనను దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్)కు లేఖ ద్వారా తెలియజేసింది. రైల్వే బోర్డు అనుమతి వచ్చిన వెంటనే అమలు ఖాయమని అధికారులు చెబుతున్నారని ఈనాడు రిపోర్ట్ చేసింది. ఈ నిర్ణయం వెనుక ముఖ్య కారణం హైదరాబాద్‌లో వేగంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య. రోజూ లక్షల వాహనాలు రోడ్డు మీద ఉండటంతో కాలుష్యం, ప్రయాణ ఆలస్యం, ఇంధన వ్యయం పెరుగుతున్నాయి. దీనికి పరిష్కారం కోసం పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దీన్లో భాగంగానే ఎంఎంటీఎస్‌లో ఉచిత ప్రయాణం ఆలోచన వచ్చింది. ఇది అమలైతే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగి రోడ్డు రద్దీ తగ్గుతుందని అంచనా వేసింది ది హిందూ. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ...మిగతాది 2 లో





# ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- నామరూపాలు లేకుండా చేస్తామంటూ ఇరాన్‌కు మాస్ వార్నింగ్

జయభేరి, న్యూఢిల్లీ :

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. తమ అణు ఒప్పందాన్ని ఇరాన్ తిరస్కరిస్తే, ఆ దేశంలోని ప్రతి పవర్ ప్లాంట్, ప్రతి వంతెనను కూల్చివేస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. "ఇకపై మంచితనానికి తావులేదు" అంటూ తన 'ట్రూత్ సోషల్' వేదికగా హెచ్చరించినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. హోర్ముజ్ జలసంధిలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ బుల్లెట్లు కురిపించిందని, ఫ్రెంచ్, బ్రిటన్ నౌకలను లక్ష్యంగా చేసుకుందని ఆయన మండిపడ్డారు. ఇరాన్ ఇప్పటికే జలసంధిని మూసివేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని, అమెరికా విధించిన నావికా దిగ్బంధనం వల్ల అది ఇప్పటికే మూతపడిందని ఎద్దేవా చేశారు. ఈ మూసివేత వల్ల ఇరాన్ ప్రతిరోజూ 500 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని కోల్పోతోందని, అమెరికాకు వచ్చే నష్టమేమీ లేదని ట్రంప్ వివరించారు. చర్చల కోసం అమెరికా ప్రతినిధులు రేపు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వెళ్తున్నారు. ...మిగతాది 2 లో



# కామన్ మ్యాన్.. సూటి ప్రశ్న..!?

మాకేనా... బ్రీఫ్ ఎనలైజర్... మరి మీ.... సంగతేంటి!? మీరెవరైతే ఏంటి చట్టానికి లోబడే కదా.. ప్రతి వ్యవస్థలో, విద్య వైద్య ం రక్షణ జ్యుడీషియల్ ఇలా అన్ని ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థల్లో అధికారి నుంచి ఉన్నతాధికారుల వరకు బ్రీఫ్ ఎనలైజర్ జరగాల్సిందే ... కామన్ మ్యాన్ డిమాండ్... సోషల్ మీడియాలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో చెక్కర్లు కొట్టిన వీడియో... హైకోర్టు అడ్వకేటుకు బ్రీఫ్ ఎనలైజర్ చేయడం సమంజసమా..!? తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ప్రజా రక్షణ వ్యవస్థలో కచ్చితంగా బ్రీఫ్ ఎనలైజర్ చేయాల్సిందే... ఇది అభ్యర్థన కాదు కామన్ మ్యాన్ డిమాండ్..!?

2 లో

# లోకేష్ పట్టాభిషేకం



- ముహూర్తం ఫిక్స్-చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఈ నెల 29న కొత్త కార్యవర్గం బాధ్యతలు
- తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం

జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 19 :


ఏపీలో కూటమి సర్కార్ ను నడుపుతున్న టీడీపీలో కీలక మార్పుకు రంగం సిద్ధమవుతోంది. సీఎం చంద్రబాబు వయస్సు రీత్యా పార్టీని నడిపేందుకు సమర్థుడిగా భావిస్తున్న ఆయన తనయుడు నారా లోకేష్ కు పార్టీ పగ్గాలు అప్పగించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే పార్టీ కమిటీల ఏర్పాటులో భాగంగా లోకేష్ ను టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎంపిక చేశారు. ఇప్పుడు ఆయన పగ్గాల స్వీకరణకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 29న కొత్త కార్యవర్గం బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రజలకు సంక్షేమం, ప్రభుత్వ సేవలు, ...మిగతాది 2 లో

# అరేయ్ ఏంట్రా ఇది..?

- ఐపీఎల్ సీజన్ అని.. ఇంట్లోనే దర్జాగా డెన్ పెట్టారు..

జయభేరి, ఏలూరు:

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీలను ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈనెల 17న జంగారెడ్డిగూడెం రాజుల కాలనీలో ఓ ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారంతో పోలీసులు రైడ్ చేశారు. అక్కడ ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా ఇందుకు సంబంధించిన ప్రధాన నిందితులు హైదరాబాద్ కెపిహెచ్‌బీ కాలనీలో ఉన్నారని తెలుసుకుని వెంటనే ఒక టీంగా ఏర్పడి అక్కడికి వెళ్లి ఐదుగురిని అరెస్టు చేశారు.



వీరందరూ క్రికెట్ మెయిన్ బుకి, సబ్ బుకీలుగా వ్యవహరిస్తూ క్రికెట్ బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తూ సిండికేట్ గా మారి పంటర్స్ (పందెం వేసే వారు) ను ఆకర్షిస్తున్నారని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రు. 2.30 లక్షల నగదు, రెండు లాప్టాప్ లు, ఒక ఐపాడ్, వైఫై సిస్టం, వివిధ బ్యాంకు ఎకౌంటులకు చెందిన సుమారు నాలుగు లక్షల రూపాయలు నగదు, 12 మొబైల్ ఫోన్లు, బెట్టింగ్ కు ఉపయోగించే సిమ్ బాక్స్ స్వాధీనం చేసుకున్నట్లు జంగారెడ్డిగూడెం ఏఎస్పి సుస్మిత తెలిపారు. బెట్టింగ్ నిర్వహించడం, వేయడం నేరమని.. ఎవరైనా ఇలాంటి నేరాలు చేస్తే.. సహించేది లేదని ఎస్పీ తెలిపారు.

# పెట్టుబడిదారులకు పండగేనా? ఇప్పుడు దీనిదే హవా..

- బంగారం, వెండి కాదు..
- కాసుల వర్షం కురిపిస్తున్న వైట్ మెటల్
- అల్యూమినియం మాస్ దూకుడు.. ఎందుకింత డిమాండ్?

జయభేరి, హైదరాబాద్ :

అక్షయ తృతీయ అనగానే అందరి దృష్టి బంగారం, వెండి ధరల మీద ఉంటుంది. ఈ ఏడాది బంగారం ధర 10 గ్రాములకు రూ.1.54 లక్షలు దాటితే, వెండి కిలో రూ.2.50 లక్షల మార్కును తాకింది. కానీ సైలెంట్‌గా దూసుకుపోతూ ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్న మరో లోహం ఉంది.. అదే అల్యూమినియం. గత నాలుగేళ్లలో ఎన్నడూ లేనంతగా లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో దీని ధరలు గరిష్ట స్థాయికి చేరుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.



మొదటిపేజీ తరువాయి

## ఉచిత ప్రయాణం

స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఎస్‌సీఆర్ జీఎంకు లేఖ రాశారు. ఈ లేఖలో సీఎం సూచనలను ప్రస్తావించి ఉచిత ప్రయాణం, పీక్ అవర్స్‌లో ట్రిప్స్ పెంచడం, స్టేషన్ సౌకర్యాలు మెరుగుపరచడం వంటి అంశాలు తెలిపారు. రైల్వే సైడ్ నుంచి దీనిపై డ్రాఫ్ట్ అవగాహనా ఒప్పందం (MoU) పంపమని కోరడంతో ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రైల్వే బోర్డు అనుమతి తీసుకుని అమలు చేస్తామని ఎస్‌సీఆర్ స్పందించిందని టెన్ టీవీ తెలిపింది.
ప్రస్తుతం ఎంఎంటీఎస్ రైళ్ల నుంచి ఏడాదికి సుమారు రూ.10 కోట్ల ఆదాయం వస్తోంది. ఉచిత ప్రయాణం అమలైనా ఈ ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ మధ్య రైల్వే (SCR)కి ఇస్తుంది. ప్రయాణికుల సంఖ్య పెరిగినా అదనపు ఖర్చు భరించవసరం లేదు. ఇది రైల్వేకి కూడా లాభదాయకంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జూన్ 2 నుంచి ఒక సంవత్సరం పాటు ప్రయోగాత్మకంగా చేసే ప్లాన్ ఉంది. ఈ కాలంలో ప్రయాణికుల సంఖ్య, ట్రాఫిక్ తగ్గుదల, ప్రజల స్పందనలు గమనించి.. తర్వాత పొడిగించాలా వద్దా అనే నిర్ణయం తీసుకుంటారు. ఈ పథకం అమలైతే సికింద్రాబాద్ నుంచి లింగంపల్లి, ఫలక్‌నుమా, బీబీనగర్ వంటి రూట్లలో ప్రయాణించే లక్షల మందికి ప్రత్యక్ష ప్రయోజనం. ఉదాహరణకు, రోజూ ఆఫీసు వెళ్లే ఒక ఉద్యోగి నెలకు రూ.500, 1000 టికెట్ ఖర్చు తగ్గుతుంది. విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రోజువారీ కూలీలు ఇంకా ఎక్కువ లాభపడతారు. ఉచిత ప్రయాణం వల్ల ప్రజల రవాణా ఖర్చులు తగ్గి ఆర్థికంగా ఉపయోగపడుతుంది. రోడ్డు మీద ప్రైవేట్ వాహనాలు తగ్గటం వల్ల ట్రాఫిక్ జామ్ తగ్గి, ప్రయాణ సమయం తగ్గుతుంది. కాలుష్యం కూడా తగ్గి పర్యావరణం మెరుగుపడుతుంది. ఇలాంటి పథకాలు ఇతర నగరాల్లో కూడా విజయవంతమయ్యాయి. ఉదాహరణకు, కొన్ని రాష్ట్రాల్లో బస్సు ఉచిత పథకాలు ప్రయాణికులను ఆకర్షించాయి. అయితే కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగితే రైళ్లలో రద్దీ, సీట్ల కొరత ఏర్పడవచ్చు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైల్వే సర్వీసులు పెంచాలని ప్రభుత్వం కోరింది. స్టేషన్లలో మెరుగైన సౌకర్యాలు, ఆర్టీసీ షటిల్ బస్సుల కోసం స్థలాలు కేటాయించాలని కూడా అభ్యర్థించింది. హైదరాబాద్‌లోని ఒక ఆఫీసు ఉద్యోగి "రోజూ రైలు టికెట్ కోసం ఖర్చు చేయకుండా ఉంటే నెలకు రూ.800 ఆదా అవుతుంది. కుటుంబానికి చాలా ఉపయోగం" అని చెప్పారు. మరో విద్యార్థి "కాలేజీకి వెళ్లేటప్పుడు బస్సు, రైలు ఖర్చులు తగ్గితే చదువు మీద ఎక్కువ దృష్టి పెట్టవచ్చు" అన్నారు. ఈ పథకం అమలైతే హైదరాబాద్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థకు కొత్త ఊపిరి వస్తుంది. మెట్రో, ఆర్టీసీతో కలిసి ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ లక్ష్యం సాధ్యమవుతుంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్యుల జీవితాల్లో సానుకూల మార్పు తెస్తుందని ఆశిస్తున్నారు. జూన్ 2 నుంచి ఏడాది పాటు ప్రయోగం విజయవంతమైతే ఉచిత ప్రయాణం శాశ్వతంగా కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటికైతే రైల్వే బోర్డు అనుమతి కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. హైదరాబాద్ వాసులు ఈ శుభవార్తను ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

## ఏప్రిల్ 29 లోపు లొంగిపోండి

విమర్శించారు. రాబోయే ఎన్నికల ఫలితాల భయంతోనే టీఎంసీ నాయకులు గూండా భాష మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అవినీతి, సిండికేట్ రాజ్యానికి అంతం పలికే సమయం ఆసన్నమైందని ప్రధాని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల ఫలితాలు బెంగాల్ రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలే టీఎంసీ అరాచకాలపై ఆగ్రహానికి నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. టీఎంసీ పార్టీకి గిరిజన నాయకులంటే ద్వేషమని, అందుకే గిరిజన మహిళా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆ పార్టీ అవమానిస్తోందని మోదీ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం గిరిజన బిడ్డను అత్యున్నత పదవిలో కూర్చోబెడితే, టీఎంసీ మాత్రం వారిని కించపరుస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ఉచిత రేషన్, పక్కా ఇళ్లు, మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర పథకాల ఫలాలు బెంగాల్ మహిళలకు చేరకుండా టీఎంసీ అడ్డుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది విడతల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే కఠిన చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా కేంద్ర పథకాల గురించి వివరిస్తూనే, స్థానిక రౌడీ మూకలకు హెచ్చరికలు జారీ చేయడం ద్వారా ఓటర్లలో భరోసా నింపే ప్రయత్నం చేశారు.

## ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఇరాన్‌కు అత్యంత న్యాయమైన ఒప్పందాన్ని ప్రతిపాదిస్తున్నామని, దాన్ని అంగీకరించడమే ఆ దేశానికి శ్రేయస్కరమని ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఇరాన్ మొండిగా వ్యవహరిస్తే, గత 47 ఏళ్లుగా ఏ అధ్యక్షుడు చేయని విధంగా ఇరాన్ 'కిల్లింగ్ మెషీన్'ను అంతం చేస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ప్రస్తుతం అమెరికా తన చమురు అవసరాల కోసం టెక్సాస్, లూసియానా వంటి ప్రాంతాల నుంచి నౌకలను సిద్ధం చేస్తోంది. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ (IRGC) చర్యలు తమకు ఏమాత్రం ఆందోళన కలిగించడం లేదని, ఇరాన్ తన వ్యూహాత్మక తప్పిదాల వల్ల సొంత ఆర్థిక వ్యవస్థనే నాశనం చేసుకుంటోందని ట్రంప్ విమర్శించారు. అంతర్జాతీయ చమురు మార్కెట్లో ఈ ఉద్రిక్తతల వల్ల ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ప్రపంచ దేశాలు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి.

## లోకేష్ పట్టాభిషేకం

రాష్ట్రాభివృద్ధి విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని... కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు పార్టీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్ లో వ్యాఖ్యానించారు. ృవాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులున్నా, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూనే ప్రజలకు సంక్షేమంఅభివృద్ధి అందించే విషయంలో రాజీ పడకుండా పరిపాలన సాగిస్తున్నామన్నారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాలని వారికి సూచించారు. మహానాడు నిర్వహణకు సంబంధించిన కమిటీల ఏర్పాటుపైనా కసరత్తు చేస్తున్నట్టు సీఎంకు పార్టీ నేతలు వివరించారు. తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పరిపాలన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పగలిగితే... ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టేలా ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారని చెప్పారు. టీడీపీ నిర్వహిస్తోన్న ట్రైనింగ్ క్లాసులతో పాటు, కాఫీ కబుర్లు వంటి కార్యక్రమాల ద్వారా లీడర్‌కేడర్ మధ్య ఎమోషనల్ బాండింగ్ ఏర్పడుతోందని తెలిపారు.

## ఇప్పుడు దీనిదే హవా..

భారత మార్కెట్‌లో అల్యూమినియం ధర ప్రస్తుతం కిలోకు రూ.375కు చేరుకుంది. బంగారం లాంటి ఖరీదైన లోహాల కంటే అల్యూమినియంలో వృద్ధి శాతం ఎక్కువగా ఉండటంతో పెట్టుబడిదారులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల యారీలో బరువు తగ్గించడం కోసం అల్యూమినియం వాడకం విపరీతంగా పెరిగింది. బ్యాటరీ కేసింగ్స్ నుంచి బాడీ పార్ట్స్ వరకు దీనికే ప్రాధాన్యత ఇస్తున్నారు. సోలార్ ప్యానెల్స్, విండ్ టర్బైన్ల తయారీలో అల్యూమినియం కీలక పాత్ర పోషిస్తోంది. చైనా, భారత్ వంటి దేశాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ లోహానికి భారీ గిరాకీ ఏర్పడింది.
డిమాండ్ ఎంత ఉన్నా, సరఫరా మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న కొన్ని యుద్ధాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు అల్యూమినియం ఉత్పత్తిని దెబ్బతీశాయి. అల్యూమినియం తయారీకి భారీగా విద్యుత్తు అవసరం. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో విద్యుత్ ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి, అది నేరుగా కస్టమర్ల మీద పడుతోంది. లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్ వేర్‌హౌస్‌లలో నిల్వలు క్రమంగా తగ్గుతుండటం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోంది. నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ఈ ఏడాది అల్యూమినియం ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. డిమాండ్ ఎక్కువగా ఉండి, సరఫరా తక్కువగా ఉండటంతో ధర తగ్గే సూచనలు కనిపించడం లేదు. బంగారం, వెండి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకోవడంతో మధ్యతరగతి ఇన్వెస్టర్లు అల్యూమినియం, రాగి వంటి లోహాలపై దృష్టి సారిస్తున్నారు.

# కామన్ మ్యాన్.. సూటి ప్రశ్న..!?

**మాకేనా... బ్రీఫ్ ఎనలైజర్... మరి మీ.... సంగతేంటి!? మీరెవరైతే ఏంటి చట్టానికి లోబడే కదా.. ప్రతి వ్యవస్థలో, విద్య వైద్య ం రక్షణ జ్యుడీషియల్ ఇలా అన్ని ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థల్లో అధికారి నుంచి ఉన్నతాధికారుల వరకు బ్రీఫ్ ఎనలైజర్ జరగాల్సిందే ... కామన్ మ్యాన్ డిమాండ్...సోషల్ మీడియాలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో చెక్కర్లు కొట్టిన వీడియో... హైకోర్టు అడ్వకేటుకు బ్రీఫ్ ఎనలైజర్ చేయడం సమంజసమా..!? తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ప్రజా రక్షణ వ్యవస్థలో కచ్చితంగా బ్రీఫ్ ఎనలైజర్ చేయాల్సిందే... ఇది అభ్యర్థన కాదు కామన్ మ్యాన్ డిమాండ్..!?**

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో మైక్రో ఫైనాన్స్ వ్యవహారం ఓ కొత్త మలుపుకు దారితీసింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో సీఐ అత్యుత్సాహం అడ్వకేట్ కి బ్రీఫ్ ఎనలైజర్ చేయడం ఇప్పుడు ప్రతి ఒక్క తెలంగాణ పౌరున్ని ఆలోచింపజేస్తుంది.
తెలంగాణ రాష్ట్రం సాధించుకుంది ప్రజల కోసం. మనకు అధికారం వస్తే మన పాలన మన రక్షణ మన ఆరోగ్యం ఉపాధి విద్య ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగి సస్యశ్యామలంగా తెలంగాణ వర్ధిల్లాలని కలలు కన్నా. కానీ ఆ కలలు నేడు పూర్తిగా విచ్ఛిన్నమైపోతున్నాయి. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో హైకోర్టు అడ్వకేట్ కి బ్రీఫ్ ఎనలైజర్ చేయడం ఇది హైకోర్టు ఆ సీఐ కి నోటీసులు జారీ చేయడం మనందరికీ తెలిసిందే. ఇదే విషయాన్ని ఆధారంగా చేసుకొని కామన్ మ్యాన్ గొంతును సవరించుకొని సంధిస్తున్న తూటా... ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో అన్ని వ్యవస్థల్లో, చివరికి జ్యుడీషియల్లో కూడా కచ్చితంగా ఉదయం బ్రీఫ్ ఎనలైజర్ జరిగిన తరువాతే విధుల్లోకి హాజరు కావాలి...

**ఇదే నినాదం ఇప్పుడు తెలంగాణ ప్రతి పల్లెల్లో స్పష్టంగా వినిపిస్తోంది. ఇది ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర గౌరవ హైకోర్టు పరిగణలోకి తీసుకొని ఇలాంటి నియమ నిబంధనను ప్రతి వ్యవస్థలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ గట్టిగా రాసుకుంటుంది.**

ప్రభుత్వ వ్యవస్థను అనగా విద్య, వైద్యం రక్షణ, ఆయా వ్యవస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఖచ్చితమైన బ్రీఫ్ ఎనలైజర్ జరిగిన తర్వాత వీధిలోకి హాజరయ్యేలా హైకోర్టు ఒక ఆర్డర్ ను తీసుకురావాలని ప్రజల్లో వాదన వినిపిస్తోంది.
నిజమే ప్రభుత్వ వ్యవస్థలు ఎవరికోసం పనిచేస్తున్నాయి!?
ప్రజాస్వామ్యం లో ప్రజల కోసం ప్రజల చేత ప్రజల యొక్క బాగోగులు చూసుకోవాలని నాయకులను ఎన్నుకుంటే ఆ నాయకులు వ్యవస్థలను పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారు. విద్య వైద్య రక్షణ ఉపాధి ఆయా రంగాల్లో పూర్తిగా అవినీతిమయమైన వ్యవస్థ ఒకవైపు ఉంటే అందుకు భిన్నంగా ఎకౌంటబుల్ వ్యవస్థ లేకపోవడం ఉన్న అది పేరుకు మాత్రమే అన్న విధంగా మారిపోవడం ఇప్పుడు ఎటు ఎడతెగని ప్రశ్నగా మిగిలింది. అందుకనే పోర్చులు కూడా ప్రజల నాడిని బట్టి తీర్పులు తీరుస్తుంది అనేది జగమెరిగిన సత్యం. అలాంటి ఉన్నతమైన కోర్సులు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జరిగిన యదార్థ ఘటనల ఆధారంగా పోలీసు వ్యవస్థలోనూ విద్య వ్యవస్థ లోను అలాగే ప్రతి వ్యవస్థలోనూ విధుల్లోకి వచ్చినప్పుడు మొట్టమొదలుగా జరగాల్సిన పని బ్రీఫ్ ఎనలైజర్.. అలా ప్రతి వ్యవస్థలో మద్యం తాగి దొరికిన ఆయా రాష్ట్రస్థాయి ఉద్యోగులకు వారి జీవితంలో నుంచి ఖచ్చితంగా ప్రతి నెల కొంత అమౌంట్ను కట్ చేస్తూ ఆ అమౌంట్ను ప్రజా ప్రయోజనాల కొరకు ఖర్చు చేయాల్సిందిగా వాదన ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. ఉదాహరణకు పోలీసు వ్యవస్థ.. ఈ వ్యవస్థలో పోలీస్ యూనిఫామ్ ధరిస్తే చాలు మేమే లా అండ్ ఆర్డర్ కి రక్షణ కారకులం అనేలా ప్రజల్ని చిన్నచూపు చూడడం వారికి నచ్చిన రీతిలో వ్యవహరించడం, తద్వారా ప్రజలకు సమాజంలోని వారిని భయభ్రాంతులకు గురి చేయడం అలవాటుగా మారిపోయింది. సెలబ్రిటీలు అయితేనేమి వాళ్ళు పౌరులు కాదా? వాళ్లకి చట్టం పనిచేయదా? కామన్ మ్యాన్ అంటే అంత చులకన? అనే ప్రశ్నలు సమాజంలో గట్టిగా ఉత్పన్నమవుతున్నాయి. అందుకే సూటిగా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రతి వ్యవస్థలో బ్రీఫ్ ఎనలైజర్ జరిగిన తర్వాతనే విధుల్లోకి హాజరయ్యేలా హైకోర్టు గట్టి నిర్ణయం తీసుకోవాలని 90% ప్రజలు కోరుకుంటున్నారు.
ఈ విషయాన్ని గౌరవ హైకోర్టు పరిగణలోకి తీసుకొని దీనిపై ఆలోచన చేస్తూ ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తీర్పును అందించాలని కోరుకుంటున్నారు. ఉదాహరణకు పోలీసు వ్యవస్థలో ఉదయాన్నే ఎవరెవరు వచ్చారు అంటూ అటెండెన్స్ తీసుకునే విధి విధానాన్ని ఒక్కసారి మనం చూసుకుంటే ఈ తతంగం అంత జరుగుతున్నప్పుడు పోలీసు బయట వస్తూ పోతూ ఉండే పాదా చారులు సామాన్యులు, ఇదో పెద్ద వింతగా చూస్తున్నారు.
అలాగే బ్రీఫ్ ఎనలైజర్ జరుగుతున్నప్పుడు కూడా ప్రజల చూపులు వారిపై పడాలి. ప్రజలందరూ ప్రతి వ్యవస్థలో బ్రీఫ్ ఎనలైజర్ జరుగుతుంటే గమనించాలి. అలా జరుగుతున్నప్పుడు ప్రజల్లో ఆల్కహాల్ అంటే తాగొద్దు అనే విధంగా తమకు తామే కంట్రోల్ చేసుకునే విధంగా వ్యవస్థ తయారవుతుంది. అలాగే బ్రీఫ్ అనాలసిస్ లో దొరికిన ఉద్యోగి తన జీవితంలో నుంచి కొంత అమౌంట్ను కట్ చేస్తూ ఆ వచ్చిన అమౌంట్ ను ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆ మొత్తాన్ని ఖర్చు చేసే వీలును కల్పించాలి.

**ప్రతి వ్యవస్థ ఒక్క పోలీసు వ్యవస్థలోనే కాదు రాష్ట్ర పరిధిలో ఉన్న అన్ని వ్యవస్థల్లో, ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో కచ్చితంగా ఉదయాన్నే విధుల్లోకి వచ్చినప్పుడు బ్రీఫ్ ఎనాలైజర్ జరిపిన తరువాతే విధుల్లోకి ఆహ్వానించాలి.**

అనే ఈ నినాదం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పౌరున్ని ఆలోచింపజేస్తోంది.
ప్రజలకు ఒకరు ఆయా వ్యవస్థల్లో పనిచేస్తున్న అధికారులకు మరో రూలు ఉండదు కదా!?
ఎందుకు ప్రజలు అంటే అంత చిన్న చూపు సీఎం దగ్గర నుంచి కామన్ మ్యాన్ వరకు కచ్చితంగా చట్టానికి లోబడే నడుచుకోవాలి. అలా నడుచుకోకుండా నేను పోలీసు ని నేను మంత్రిని నేను ఆఫీసర్ ని అంటూ అధికారం చలాయించే ప్రతి ఒక్కరి అహంకారాన్ని అణిచేలా ప్రతి ఒక్కరూ ప్రజలకు ఉపయోగపడే సాధనంల పని చేయాలన్న ఉద్దేశంతోనే ఈ వాదన ప్రజల నుంచి బలంగా వినిపిస్తోంది. ఒక హైకోర్టు అడ్వకేట్ కి ఇంత అవమానం జరిగినప్పుడు కామన్ మ్యాన్ కి ఎక్కడ రక్షణ ఉంటుంది అనేది వేయి డాలర్ల ప్రశ్న? బ్రీఫ్ ఎనలైజర్ దొరికిన ప్రతి అధికారికి తన జీవితం నుంచి జీవితకాలం కొంత అమౌంట్ కట్ అవుతూ అది ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి ఆర్థిక రంగ నిపుణులు ఆలోచన చేసిన ప్రకారం ఆ మొత్తాన్ని ఉపయోగించుకునేలా ఆలోచన జరపాలి. రాష్ట్రంలోని ప్రజా వ్యవస్థలో పనిచేసే అధికారులు ప్రజల కోసం పనిచేస్తున్నామని ఆలోచనను అధికారుల్లో కల్పించాలి. ఏ వ్యవస్థ అయినా సరే ప్రభుత్వ రంగ సంస్థలు ఏదైనా సరే ప్రజలకు సహాయం చేసేవారిగానే ఉండాలి తప్ప వారిని వారిపై అధికారం చెలాయించే విధంగా ప్రజల్ని బానిసలుగా చూసే వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలి.

**ముఖ్యంగా విద్య వైద్యం రక్షణ రెవిన్యూ, జ్యూడిషియల్ ఈ రంగాల్లో పూర్తిగా కిందిస్థాయి అధికారుల నుండి ఉన్నత స్థాయి అధికారులకు ఉదయాన్నే విధుల్లోకి హాజరవు తున్నప్పుడు బ్రీఫ్ ఎనలైజర్ చేసి ఆ రీడింగ్ పోలీస్ స్టేషన్ పబ్లిక్ బోర్డు మీద రాసి విధుల్లోకి హాజరు కావాలి.**

ప్రజలకు ఉపయోగపడని ఏ ప్రభుత్వ రంగ సంస్థ అయినా దానివల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం ఉండదు. అలా అని రక్షణ శాఖ ప్రజల్ని బానిసలుగా చూస్తూ భయప్రాంతులకు గురి చేసే వ్యవస్థను పూర్తిగా ప్రజాస్వామ్యంలో రద్దు చేయాలి. ప్రజాస్వామ్యానికి అర్థాన్ని పరమార్థాన్ని అందించాలి అంటే కచ్చితంగా ఈ చట్టాన్ని రప్పి ప్రభుత్వ రంగ సంస్థల్లో విధిగా తీసుకురావాలి.





కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత



# భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట

### శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.43.96 లక్షలు

జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 19 :

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట సందడిగా మారింది. స్వామి వారి దర్శన క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం, టికెట్ల విక్రయ కేంద్రాలు, పార్కింగ్, బస్టాండ్, పుష్కరిణి, తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**కొనసాగుతున్న నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**యాదగిరీశుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి, అమ్మవార్లకు రూ.43,96,600 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,68,500, బ్రేక్ దర్శనం ద్వారా రూ.3,41,400, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,43,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.5,33,550, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,84,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.92,232, ప్రసాద విక్రయం ద్వారా రూ.15,38,650, కల్యాణకట్ట ద్వారా రూ.1,40,000తోపాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

**యాదగిరీశుడి సేవలో ప్రముఖులు..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, తెలంగాణ హ్యాండీక్రాఫ్ట్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ వేర్వేరుగా దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా యాదగిరిగుట్టకు వచ్చిన వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామి వారి లడ్డు ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.

# మోడీ, ట్రంప్, నిర్ణయాల వల్ల భారత దేశ రైతన్నకు అన్యాయం

- వెంటనే యూఎస్ ట్రేడ్ డీల్ ను వెనక్కి తీసుకోవాలి
- ట్రంప్, మోడీ, భారత రైతుల ప్రాణాలతో చెలగాటమడుతున్నారు
- యూఎస్ ట్రేడ్, డీల్ వల్ల రైతన్నలకు ఆత్మహత్యలే శరణ్యం
- షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**జయభేరి, షాద్ నగర్, ఏప్రిల్ 19 :**

మోడీ, ట్రంప్, నిర్ణయాల వల్ల భారతదేశ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వెంటనే యూఎస్ ట్రేడ్ డీల్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ట్రంప్,మోడీ భారత రైతన్నల ప్రాణాలతో చెలగటమడుతున్నారని యూఎస్ ట్రేడ్ డీల్ వల్ల రైతన్నలకు ఇక ఆత్మహత్యలె శరణ్యమని షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... యూఎస్ ట్రేడ్ డీల్ వల్ల ఈ దేశ రైతన్నలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రైతులు పండించిన పంటకు ధర తగ్గితే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని దీన్ని పక్కన పెట్టేసిన మోడీ అమెరికాకు లొంగి భారత రైతన్నకు అన్యాయం చేస్తున్నారని గతంలో కూడా మూడు రైతు నల్ల చట్టాలను తీసుకొస్తే రాహుల్ గాంధీ మల్లికార్జున ఖార్గే ఆధ్వర్యంలో నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడమని భారతదేశ వ్యవసాయ రంగాన్ని అమెరికా వ్యాణిజ్య సంస్థల ముందు మోడీ తాకట్టు పెట్టారని ఆదానీ, అంబానీలా కాపాడాందుకే దేశవ్యాప్తంగా రైతులకు మోడీ నిర్ణయాల వల్ల నష్టం జరుగుతుందని అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుతూ ఈ దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ పార్లమెంటులో పోరాడుతున్నారని కానీ బిజెపి ప్రభుత్వం మాత్రం మహిళా బిల్లు ముసుగులో ఢిలిమెడిటేషన్ బిల్లు తెచ్చారని దాన్ని ఆయా ప్రాంతీయ పార్టీలతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా వ్యతిరేకించిందని బీజేపీ ప్రభుత్వం ప్రవర్తిస్తున్న తీరును ఈ దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేందర్ షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బస్వం వైస్ చైర్మన్ అందే మోహన్, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి జంగా నర్సింహా, శేఖర్, రఘు, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.



## ఆగి ఉన్న కారును ఢీ కొట్టిన మరొక కారు వ్యక్తి మృతి

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 19 :**

ఆగి ఉన్న కారును వెనక నుండి మరొక కారు ఢీ కొట్టిన సంఘటనలో ఒక వ్యక్తి మృతి, ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నాగారంకు చెందిన చీరాల పవన్ కుమార్ (39)తోపాటు తిలక్ కుమార్ లు జగదేవ్పూర్ కు వెళ్తున్న సమయంలో వాసాలమర్రి గ్రామ శివారు ప్రాంతంలో మూత్ర విసర్జన కోసం కారు ఆపి దిగుతున్న సమయంలో వెనక నుండి భువనగిరి నుండి జగదేవ్పూర్ కు వెళ్తున్న జగదేవ్పూర్ నివాసి కొంపల్లి గణేష్ కారు ఢీకొట్టడంతో పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తిలక్ కుమార్ కు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తక్యుద్దీన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.



## రక్తదాతల సేవ స్ఫూర్తి అభినందనీయం

- జిల్లా కలెక్టర్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దివాకర టిఎస్

**జయభేరి, ములుగు :**

రక్తదానం చేయడం ద్వారా నిండు ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదాతల సేవ స్ఫూర్తి ప్రశంసా నియమని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు శనివారం ములుగు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ టి జి ఓ అసోసియేషన్, టీఎన్జీవో యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ములుగు గట్టమ్మ దేవాలయ సమీపంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మనం ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు ఒక నిండు ప్రాణాన్ని నిలబెడుతుందని, రక్తదానం అనేది కేవలం ఒక కార్యక్రమంగా చూడకూడదని,అది ఒక గొప్ప సామాజిక సంస్కృతిగా మారాలని ఉద్ఘాటించారు. జీవితాలను కాపాడే మహత్తర సేవలో భాగంగా ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తం అందుబాటులో ఉండడం అత్యవసర చికిత్సలలో ఎంతో కీలకమని,ముఖ్యంగా ప్రమాదాలు,శస్త్రచికిత్సలు,అత్యవసర వైద్య సేవల సమయంలో రక్తదానం ప్రాణదాతగా నిలుస్తుందని అన్నారు. జిల్లాలోని ప్రజలు,ఉద్యోగులు, ఉపాధ్యాయులు ,యువత,పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 19 :**



సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి స్థానంలో ఉందని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్పేట్ డివిజన్ సింగాయిపల్లిలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమిడి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి లబ్ధిదారులు సమీనా బేగం,షేక్ ఇమ్రాన్ దంపతులు సుమారు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించుకున్న గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గృహ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఇలాంటి సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం అతిథులను సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలిపారు . కాగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ, సహకరించిన నాయకులు మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పారనంది బాల్ రాజు, మహ్మద్ జాఫర్, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, పిన్నింటి ధర్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మిర్యాలకర్ సాయికుమార్, నక్క మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

# వైభవంగా సుదర్శన హోమం

- శ్రీ లక్ష్మి నరసింహుడి కళ్యాణం పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,ఎమ్మెల్సీ తిన్మార్ మల్లన్న,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర,మాజీ శాసన మండలి ఛైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎంపీ విహెచ్ హనుమంతరావు,మాజీ ఎమ్మెల్సీలు పూల రవీందర్, ఆకుల లలిత.



**జయభేరి, యాదగిరిగుట్ట :**

యాదగిరిగుట్ట మున్నూరు కాపు సత్రం ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఎత్తున శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 108 మంది దంపతులతో సుదర్శన నరసింహ హోమం ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగింది. అనంతరం వెయ్యి ఎనిమిది. మంది దంపతులతో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. లోక కళ్యాణ దుర్గం విశ్వశాంతి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మున్నూరు కాపు సామాజి బంధువులతో పాటు అనేక పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి విచ్చేసారు. ఈ కార్యక్రమానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. మున్నూరు కాపు సామాజిక వర్గం బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి చైర్మన్ నేతి విద్యాసాగర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ రాజ్యసభ సభ్యులు విహెచ్.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, పూల రవీందర్,మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, పీసీసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రుద్ర సంతోష్ కుమార్, టీఎంకే జేఏఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కోఆర్డినేటర్ తూడి జనార్దన్, జిల్లా అధ్యక్షుడు కుమార్ స్వామి, మున్నూరు కాపు ట్రస్ట్ నిర్వాహకులు పొతంశెట్టి అనిల్ కుమార్, పలుగుల శ్రీనివాస్, పుష్పాల నర్సింహులు, యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్, వైస్ ఛైర్మన్ బరిగే రమ్యారాంచందర్, కౌన్సిలర్లు సాధునేని ధనలక్ష్మిమధుకర్,బూడిద మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాట్య మండలి కళాకారులకు అవకాశం కల్పించాలి

**జయభేరి, యాదగిరిగుట్ట:**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనలిచ్చేందుకు ప్రజానాట్య మండలి కళాకారులకు అవకాశం కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి కోరారు. ఆదివారం యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్‌ను కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులు, చిరు వ్యాపారులు,స్థానిక సమస్యలపై ఆలయ ఈవోకు వివరించినట్లు తెలిపారు. ప్రజా నాట్యమండలి కళాకారులు సమాజ సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారని తెలిపారు. అలాంటి కళాకారులకు బ్రహ్మోత్సవాల వంటి మహత్తర వేదికల్లో ప్రదర్శనలకు అవకాశం కల్పించడం ద్వారా సంప్రదాయ కళలకు ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. యాదగిరిగుట్ట కొండపై పలు సమస్యలను ఈవో దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ,చెక్క వెంకటేష్,ఎండీ ఇమ్రాన్, పేరబోయిన మహేందర్,సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రికి స్వాగతం పలికిన కౌన్సిలర్లు

**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మాజీ మంత్రి హరీష్ రావుకు బిఆర్ఎస్ పార్టీ నాయకుడు మాజీ మంత్రి హరీష్ రావు నల్లగొండ జిల్లా గుర్రంపోడు లో నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమానికి వెళుతూ కొండమల్లేపల్లి పాలకేంద్రంలో విశ్రాంతి కొరకు కొద్దిసేపు ఆగారు. మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్, దేవరకొండ 18 వ వార్డు కౌన్సిలర్ వీరమోని అంజి గౌడ్, 16 వ వార్డు కౌన్సిలర్ కేతావత్ రూప్ల నాయక్ పుష్ప గుచ్చం ఇచ్చి శాలువాలతో సన్మానం చేసినారు.

చింతపల్లిలో మాజీ మంత్రి హరీష్ రావుకు బిఆర్ఎస్ కార్యకర్తల ఘన స్వాగతం బిఆర్ఎస్ పార్టీ నాయకుడు మాజీ మంత్రి హరీష్ రావు నల్లగొండ జిల్లా గుర్రంపోడు లో నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమానికి వెళుతూ చింతపల్లి రోడ్డుపై కొద్దిసేపు ఆగారు. దేవరకొండ మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్, చింతపల్లి మండలం మాజీ ఎంపిటిసి కుంభం శ్వేత శ్రీశైలం గౌడ్, కురుమేడు సర్పంచ్ కంబాలపల్లి లాలమ్మ చెన్నయ్య , మహేష్ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు హరీష్ రావుకు శాలువాలతో సన్మానించి పుష్ప గుచ్చాలు అందించి ఘనస్వాగతం పలికారు. కార్యకర్తలకు అభివాదం చేస్తూ గుర్రంపోడు లో నిర్వహిస్తున్న కార్యకర్తల సమావేశానికి వెళ్లారు.

## పార్టీ బలోపేతానికి కార్యనిర్వాహణ ముఖ్యం

- బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి
- భూత్పూర్ లో ప్రశిక్షణా తరగతులు ప్రారంభం



**జయభేరి, దేవరకద్ర :**

పార్టీ బలోపేతానికి కార్యనిర్వహణ చాలా ముఖ్యమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం బూత్పూర్ టౌన్, భూత్పూర్ రూరల్ కు సంబంధించిన పండిట్ దీన్ దయాల్ ప్రశిక్షణ మహాబియాన్ తరగతులు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి కొండ ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ బలోపేతం కావాలంటే బూతు స్థాయి నుండి బలపడాలన్నారు. పార్టీ బలపడాలంటే బూత్ స్థాయి కార్యకర్తల కృషి ఎంత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రశిక్షణ తరగతులను ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, బిజెపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సాహితి రెడ్డి, భూత్పూర్ టౌన్ అధ్యక్షుడు రాజగోపాల్ రెడ్డి లతోపాటు బూత్ అధ్యక్షులు, బూత్ ప్రధాన కార్యదర్శులు,ఆయా మండలాల కమిటీల సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం



**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 19:**

మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశ్వాపూర్ 10 వ వార్డు కౌన్సిలర్ మెరుపాటి గోవర్ధన్ రెడ్డి నివాసంలో మల్లన్న స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి పాల్గొని వేడుకలను తిలకించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మల్లన్న స్వామి కృపా కటాక్షాలతో అందరు సంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వేంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, జెర్రిపోతుల నర్సింహులు, శ్రావణ్ కూమార్, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పాటిస్తున్నవారి వాహనాలకు ఛాంపియన్ స్టిక్కర్లు


**జయభేరి, వరంగల్ :**

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'అరైవ్అలైవ్' కార్యక్రమంలో భాగంగా వరంగల్ పోలీసులు వినూత్న ప్రచారాన్ని చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న వాహనదారులను గుర్తించి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్పెక్టర్ సీతా రెడ్డి వారి వాహనాలకు "అరైవ్అలైవ్ ఛాంపియన్2026" స్టిక్కర్లను అంటించి అభినందించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఛాంపియన్స్ అవ్వాలని ఏసీపీ సూచించారు

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సుముఖమే

- బిల్లు పేరుతో రిజర్వేషన్ ఎత్తివేతకు జిజేపి కుట్రలు
- చిత్తశుద్ధితో ప్రవేశ పెడితే కాంగ్రెస్ పార్టీ ఆమోదిస్తుంది.
- ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టీకరణ

**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 19 :**




చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా బిల్లు బీజేపీ ప్రభుత్వానికి ఇష్టం లేదనే రిజర్వేషన్ బిల్లు 131 పేరుతో ఒకేసారి మూడు బిల్లులను ప్రవేశపెట్టిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం యాదగిరిగుట్టలోని తన నివాసంలో ముఖ్య నాయకులతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మహిళా బిల్లు పేరుతో ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని ఖూనీ చేయడానికి కుట్రలో భాగంగానే పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్ (131వ రాజ్యాంగ సవరణ) ముసుగులో దేశ సమాఖ్య స్వరూపాన్ని దెబ్బతీయాలని చూసిన మోడీ, అమిత్ షా కుట్రలను కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వంలో పటాపంచలు జరిగిందన్నారు.
బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే 2023లో తీసుకువచ్చిన మహిళా ప్రత్యేక బిల్లును వెంటనే పార్లమెంట్ లో అమలు పరిస్తే భారత దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు పూర్తి మద్దతు తెలుపుతాయని అన్నారు. డీలిమిటేషన్ పేరుతో మళ్లీ అధికారంలోకి రావడం కోసం ప్రయత్నం చేస్తున్న బీజేపీ మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, రాజకీయ అవసరాల కోసం, రాజకీయ ఎత్తుగడల కోసం మహిళలని అడ్డం పెట్టుకొని రాజకీయం చేస్తున్న మోదీ దొంగాటను దేశ ప్రజలు గమనిస్తున్నారని,ఇలానే చేస్తే భవిష్యత్తులో ఆ పార్టీకి మనుగడ ఉండదన్నారు. డీలిమిటేషన్ పేరుతో 50 శాతం కేటాయింపు వల్ల దక్షిణాది రాష్ట్రాలు పూర్తిగా నష్టపోతాయయని, నష్టం జరగకుండా ఉండేందుకు పార్లమెంట్ లో రాహుల్‌గాంధీ, ఖర్గే, ప్రియాంక గాంధీ ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి మహిళా బిల్లుకు తెరదించారన్నారు.
ప్రత్యేక మహిళా బిల్లు ఆమోదం పొందినాక అన్ని రాష్ట్రాల నాయకత్వంలో డీలిమిటేషన్‌పై చర్చించిన తర్వాతే అమలు పర్చాలని, దానికి కాంగ్రెస్ పూర్తి మద్దతునిస్తుందని తెలిపారు.
ఈ సమావేశంలో మదర్ డెయిరీ చైర్మన్ గుటిపాటి మధుసూదన్‌రెడ్డి,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి,మాజీ డీసీసీబీ అధ్యక్షుడు ఆండెం సంజీవరెడ్డి,యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, వైస్ చైర్మన్ బరిగె రమ్య రాంచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు మధు,పెలిమెల్లి లావణ్య శ్రీధర్, పట్టణాధ్యక్షుడు బందారపు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## ఏమమ్మా షెడ్డు ఎలా నడుస్తుంది

- గేదెల షెడ్డును పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకద్ర :**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని అడ్డాకుల మండలం ముత్యాలంపల్లి వద్ద ఆదివారం గేదెల షెడ్డును క్రీడా శాఖ మంత్రి వాటిడి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్)లు పరిశీలించారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమకు సంబంధించి అంశాలపై స్థానిక రైతుల వద్ద వారు చర్చించారు. షెడ్డు ఎలా నడుస్తుందని వారికి కుశల ప్రశ్నలు వేశారు. అలాగే షెడ్డు పనితీరును వారు స్వయంగా పరిశీలించారు.

## అన్నదాతలకు అండగా ప్రభుత్వం

దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్




**జయభేరి, దేవరకద్ర :**
అన్నదాతలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంతో పాటు మదనాపురం మండలం రామన్ పాడు గ్రామంలో ఆదివారం రాత్రి వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. అనంతరం రామన్ పాడు గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాలలో కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చలివేంద్రానికి ఎస్పీఆర్ పాఠశాల 100 కేజీల పెరుగు పంపిణీ



**జయభేరి, కొండమల్లేపల్లి :**
కొండమల్లేపల్లి లో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి ఆదివారం కొండమల్లేపల్లి ఎస్పీఆర్ పాఠశాల (శ్రీ వెంకటేశ్వర కళాశాల) నిర్వాహకులు 100 కేజీల పెరుగు అందించారు. ఈ సందర్భంగా చలివేంద్రంలో సుమారు 2000 మందికి పైగా పాదాచారులు, ప్రజలకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రతిరోజు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మజ్జిగ పంపిణీ చేశారు. కేఎంపి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు ఎస్పీఆర్ పాఠశాల నిర్వాహకులను ఘనంగా సన్మానించి అభినందించారు. ప్రతిరోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఉండడంతో సహృదయులైన దాతలు ముందుకు వచ్చి సహకరించాలని చలివేంద్ర నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, సునీత రెడ్డి, విప్లవ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరేష్, కెఎంపీ హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు ఏరుకొండ రాము,కూన భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## కురుమ సంఘం నూతన అధ్యక్షుడిగా అచ్చిన మల్లయ్య



**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 19 :**
యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో బీరప్ప ఆలయంలో కురుమ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆదివారం జరిగిన సమావేశంలో కురుమ సంఘం వంగపల్లి గ్రామ నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అచ్చిన మల్లయ్య,ప్రధాన కార్యదర్శిగా జోగు మహేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని కురుమ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కురుమలు రాజకీయంగా చైతన్యవంతులై ఐక్యంగా ఉండాలన్నారు. కురుమల హక్కుల సాధనకు, వారి అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం యూత్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుజ్జ సిద్ధులు, ప్రధాన కార్యదర్శిగా జోగు భాను ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో కురుమ సంఘం మాజీ అధ్యక్షులు రేగు బాలనర్సయ్య,ఎన్నికల అధికారి కల్లేపల్లి శ్రీశైలం, ఉప సర్పంచ్ చిన్నం మల్లయ్య,పెద్ద కురుమ గోధుమ బీరయ్య, జోగు చంద్రయ్య,వార్డు సభ్యులు చిన్నం మల్లేష్,కళ్ళె వినోద్, కురుమ సంఘం సభ్యులు అచ్చిన కృష్ణస్వామి, ఒగ్గు నవీన్,ఏడపల్లి మహేష్, జోగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**



రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం పోతులమడుగు లో ఐకెపి ఆధ్వర్యంలో, అన్నసాగర్ లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో, మూసాపేట మండలం జానంపేటలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో, కొమ్మిరెడ్డి పల్లి లో ఐకెపి ఆధ్వర్యంలో ఆదివారం వరి కొనుగోలు కేంద్రాలను దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాలో పడుతున్నాయన్నారు. సన్నాలు ధాన్యం కింటాకు రూ. 2389, సాధారణ రకం క్వింటాల్ కు రూ. 2350 మద్దతు ధర ఇస్తున్నామన్నారు. సన్నరకం ధాన్యం క్వింటాల్ కు రూ.500 బోనస్ కూడా ఇస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యాన్ని విక్రయించాలని ఎమ్మెల్యే రైతులకు సూచించారు.
ధాన్యం కొనుగోలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, గన్ని బ్యాగుల అవసరం ఉంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని అధికారులను ఎమ్మెల్యే సూచించారు.
కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావలసిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నేడు దేవరకద్ర మండలంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన

**జయభేరి, దేవరకద్ర :**
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలంలో సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ దేవరకద్ర మండల అధ్యక్షుడు బూనేటి అంజిల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 9:45 గంటలకు దేవరకద్ర మండలం నాగారం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభిస్తారన్నారు. అలాగే 10:30 గంటలకు దేవరకద్ర మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులు కూడా వరి మరియు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. దేవరకద్ర మండలం గోపన్ పల్లి లో 11:30లకు వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారు అలాగే అక్కడ ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొంటున్నట్లు అంజిల్ రెడ్డి తెలిపారు. కావున ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలు హాజరుకావాలని ఆయన కోరారు.

# విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జిఎంఆర్
- పేరూర్ లో ఘనంగా జిల్లా పరిషత్ పాఠశాల 75వ వజ్రోత్సవాలు

**జయభేరి, దేవరకద్ర :**




విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల మండలం పేరూర్ లో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాల 75వ వజ్రోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ శృతి అరవింద్ రెడ్డి, గ్రామ పెద్దలు బసిరెడ్డిలతో కలిసి దీప ప్రజ్వలన చేసి వారు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు ప్రసంగించారు. విద్య గురించి తెలియని రోజుల్లో విద్యకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి ఆనాడు 1950లో పేరూర్ గ్రామ పెద్దలు, మాజీ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ కేకే.రెడ్డి గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయించారని వారి సేవలను కొనియాడారు. పేరూర్ పాఠశాలలో మ్యాథమెటిక్స్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా పాఠశాల వద్ద మినీ స్టేడియం మంజూరు చేయాలని మంత్రి వాకిటి శ్రీహరిని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి గ్రామానికి మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి పాఠశాలకు వచ్చే దాదాపు 60 మంది విద్యార్థులకు మంత్రితో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ సైకిళ్ళను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్త అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి లతో పాటు పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## విద్యుత్ కోతలపై రైతుల కన్నెర్ర

- కేశవరం లోని సబ్ స్టేషన్ ముందు నిరసనకు దిగిన రైతులు
- మద్దతు తెలిపిన పలువురు నేతలు
- తక్షణమే విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 19 :**



అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయంటూ కేశవరం గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా కేశవరం గ్రామంలో విద్యుత్ కోతల సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి పంటలు కోత దశకు చేరుకున్న కీలక సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని, దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు . ఈ నేపథ్యంలో ఆదివారం కేశవరం లోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సబ్ స్టేషన్ లోని సిబ్బందికి వినతి పత్రం అందించారు. స్థానిక 24వ వార్డ్ కౌన్సిలర్ మాధవి భూమేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసనలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చేతికి వచ్చే సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో సాగునీటి పంపులు సరిగా పనిచేయకపోవడం వల్ల పంటలకు నీరు అందడం లేదని, ఇప్పటికే పలు ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా కౌన్సిలర్ మాధవి భూమేష్ గౌడ్ మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని, వ్యవసాయం పూర్తిగా విద్యుత్‌పై ఆధారపడిన ఈ రోజుల్లో నిరంతర సరఫరా లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు . అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని , లేని పక్షంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం రైతు సంఘం నాయకులు ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, వరి పంటలు కోత దశలో ఉన్నప్పుడు విద్యుత్ కోతలు విధించడం అన్యాయమని, ఇది రైతుల జీవనాధారంపై దెబ్బ కొట్టే చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు . అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ కంటెస్టెంట్ అభ్యర్థి బొమ్మలపల్లి చిత్తార్ యాదవ్ మాట్లాడుతూ రైతుల సమస్యలను పట్టించుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చూపుతుందని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో కొంపల్లి గోపాల్ గౌడ్, కొంపల్లి రవి గౌడ్, మామిళ్ళ చంద్రయ్య యాదవ్, మహాదేవుని రమేష్ తదితర నాయకులు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు.

## రేవంత్ సభను విజయవంతం చేయాలి



**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 19 :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' నిధుల విడుదల కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాల కాంగ్రెస్ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కాటారంలో జరగనున్న ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, ఆయనతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, దానికి రైతు భరోసా పథకమే నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలి వచ్చేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా బాధ్యతలను కేటాయించిన ఆయన, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను, పార్టీ శ్రేణులను కోరారు. కాటారం సభ ద్వారా రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చాటి చెప్పబోతున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# నా ఉద్దేశ్యం అది కాదు..


ఇదివరకు ఇదే వివాదంపై విష్ణుప్రియపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఇక అనన్య కూడా డబ్బులు చెల్లించి చూసే ఈ కంటెంట్‌లో ఆమె 'అడల్ట్' లేదా 'బూతు' కంటెంట్ పోస్ట్ చేస్తోందని కొందరు సోషల్ మీడియాలో ప్రచారం మొదలుపెట్టారు. ఈ ఆరోపణలను అనన్య నాగళ్ళ తీవ్రంగా ఖండించారు. తాను సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌లో పోస్ట్ చేస్తున్నది కేవలం భక్తికి సంబంధించిన కంటెంట్ అని ఆమె స్పష్టం చేశారు. "నేను నా పర్సనల్ లైఫ్ విశేషాలతో పాటు, నాకు ఇష్టమైన ఆధ్యాత్మిక విషయాలను, దేవాలయాల సందర్శన వీడియోలను అక్కడ పంచుకుంటున్నాను. అందులో ఎలాంటి అశ్లీలత లేదు. కేవలం భక్తి కంటెంట్ మాత్రమే ఉంది" అని ఆమె తెలిపారు. డబ్బులు తీసుకుని ఇలాంటి కంటెంట్ పెట్టడం ఏంటని ప్రశ్నించే వారికి సమాధానమిస్తూ.. ఇది ప్లాట్‌ఫామ్ కల్పించిన సౌకర్యమని, తన ప్రైవేట్ స్పేస్‌ను గౌరవించే అభిమానుల కోసం మాత్రమే దీనిని ఉద్దేశించినట్లు పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు చేసే ముందు నిజానిజాలు తెలుసుకోవాలని ఆమె సూచించారు.



# అప్పుడే ఓటీటీలోకి 'బైకర్'!

ఈ ఏడాది ప్రారంభంలో సంక్రాంతికి నారి నారి నడుమ మురారి సినిమాతో సాలిడ్ హిట్ అందుకున్నాడు శర్వానంద్. దీని తర్వాత బైకర్ అంటూ ఓ స్పోర్ట్స్ డ్రామాతో మన ముందుకు వచ్చాడు శర్వా. అభిలాష్ రెడ్డి తెరకెక్కించిన ఈ సినిమాలో సీనియర్ హీరో రాజశేఖర్ హీరో తండ్రిగా ఓ కీలక పాత్రలో కనిపించారు. మాళవిక నాయర్ హీరోయిన్ గా యాక్ట్ చేసింది. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా యూవీ క్రియేషన్స్ బైకర్ సినిమాను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. అందుకు తగ్గట్టుగానే ఏప్రిల్ 03న ప్రేక్షకుల ముందుకు వచ్చిన బైకర్ సినిమా ప్రేక్షకుల మెప్పు పొందింది. మరీ బ్లాక్ బస్టర్ టాక్ రాకపోయినా హిట్ టాక్ తో మంచి వసూళ్లనే రాబట్టింది. శర్వానంద్, రాజశేఖర్ ల నటన, తండ్రీ కొడుకుల ఎమోషనల్ సెంటిమెంట్, రేసింగ్ సన్నివేశాలు బైకర్ సినిమాలో హైలెట్ గా నిలిచాయి. సామాన్యులే కాదు అక్కినేని నాగార్జున, పీవీ సింధు లాంటి ప్రముఖులు కూడా బైకర్ సినిమాను చూసి ప్రశంసలు కురిపించారు. కాగా ఇప్పటికీ థియేటర్లలో ఓ మోస్తరు వసూళ్లను రాబడుతోన్న బైకర్ సినిమా డిజిట్ స్ట్రీమింగ్ కు సిద్ధమైందని సమాచారం. బైకర్ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు ఈ సినిమా మే 1, 2026 నుండి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. అయితే ఇది ప్రస్తుతం కేవలం రూమర్ మాత్రమే. త్వరలోనే ఈ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. బైకర్ సినిమాలో బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి తదితరులు వివిధ పాత్రల్లో మెరిశారు. జిబ్రాన్ ఈ మూవీకి స్వరాలు అందించారు. మరి థియేటర్స్ లో మంచి స్పందన తెచ్చుకున్న బైకర్ సినిమాకు ఓటీటీలో ఎలాంటి రిజల్ట్ వస్తుంది అనేది చూడాలి.

# మెగా మూవీలో కీ రోల్?



ఒకనాటి బాలీవుడ్ సూపర్‌స్టార్ అనిల్‌కపూర్ 'యానిమల్'తో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. అగ్ర హీరోల సినిమాల్లో ప్రాధాన్యత గల పాత్రలకు దర్శక,నిర్మాతలు కూడా అనిల్‌కపూర్ వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఆయన ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే.. మరో ప్రతిష్టాత్మక తెలుగు సినిమాలోనూ అనిల్‌కపూర్ భాగం కానునట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అగ్ర హీరో చిరంజీవి కథానాయకుడిగా కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కించనున్న చిత్రంలో అనిల్‌కపూర్ కీలక పాత్ర పోషించనున్నారట. ఇటీవలే బాబీ ఆయనకు కథ వినిపించడం, పాత్ర నచ్చడంతో అనిల్ ఓకే చెప్పడం జరిగిపోయిందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇప్పటికే ఈ సినిమాలో మోహన్‌లాల్ నటిస్తున్నట్టు వార్తలొస్తున్నాయి. ఇప్పుడు అనిల్ కూడా తోడైతే పానిండియా మార్కెట్‌కి ఢోకా ఉండదంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు.



# పుష్పలో సమంత సాంగ్‌ను మిస్ అయ్యింది..

'పుష్ప: ది రైజ్' సినిమా 2021లో విడుదలైంది. ఈ సినిమా కథ, నటన, సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయితే, ఈ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచినవాటిలో స్పెషల్ సాంగ్ "ఊ అంటావా మావా" ఒకటి ఈ పాట సినిమాకు వన్ ఆఫ్ ది హైలైట్‌గా మారింది. "పుష్ప: ది రైజ్" సినిమాలో సమంత "ఊ అంటావా మావా" అంటూ స్పెషల్ సాంగ్ తో అదరగొట్టింది. ఈ పాటను దేవి శ్రీ ప్రసాద్ సంగీత దర్శకత్వంలో చంద్రబోస్ రచించారు, ఇంద్రావతి చౌహాన్ దీనిని ఆలపించారు. ఈ పాటలో సమంత గ్లామరస్ లుక్, అమ్మడి డాన్స్ ప్రేక్షకులను ఆకర్షించాయి. బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ లుక్‌తో కనిపించింది సామ్. అయితే ముందుగా ఈ సాంగ్ కోసం మరో హాట్ బ్యూటీని అనుకున్నారట. ఈ విషయాన్నీ స్వయంగా నిర్మాతే చెప్పారు. ఆమె ఎవరో కాదు హాట్ బ్యూటీ కేతిక శర్మ. నితిన్ హీరోగా నటించిన రాబిన్ హుడ్ అనే సినిమాలో కేతిక స్పెషల్ సాంగ్ చేసింది. గతంలో రాబిన్ హుడ్ సినిమా ప్రమోషన్స్ లో చిత్రనిర్మాత రవి పుష్ప సినిమాలో స్పెషల్ సాంగ్ కోసం ముందుగా కేతిక శర్మను అనుకున్నాం అని తెలిపారు. పుష్ప సాంగ్ చేసిఉంటే ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మరోలా ఉండేది అని నెటిజన్స్ అంటున్నారు.

# బాలకృష్ణ సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా.. హీరోయిన్‌గా నటించిన ఏకైక టాలీవుడ్ బ్యూటీ..



టాలీవుడ్ హీరోయిన్ మీనా గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. దశాబ్దాలుగా ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో తనదైన ముద్ర వేసింది. చైల్డ్ ఆర్టిస్టుగా తెరంగేట్రం చేసిన ఆమె.. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో ఎన్నో హిట్ చిత్రాల్లో నటించింది. అలాగే స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సుదీర్ఘ సినీ ప్రస్థానం, బాల్య విశేషాలు, విద్య, స్ఫూర్తిదాయక విషయాలను పంచుకున్నారు. బాలనటిగా 50 చిత్రాలలో నటించిన మీనా, 1982లో నెంజంగళ్ చిత్రంతో శివాజీ గణేశన్‌తో తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. రజినీకాంత్, కమల్ హాసన్, మమ్ముట్టి, బాలకృష్ణ వంటి దిగ్గజ నటులతో బాలనటిగా, ఆపై హీరోయిన్‌గా నటించిన అరుదైన గౌరవం మీనాకు దక్కింది. బాలకృష్ణతో కలిసి డిస్కో డాన్సర్ చిత్రంలో బాలనటిగా నటించిన విషయం చాలా మందికి తెలియదని ఆమె తెలిపారు. శ్రీదేవి, జయలలిత వంటి కొద్దిమంది నటీమణులకు మాత్రమే దక్కిన ఈ అరుదైన ప్రస్థానం తన కెరీర్‌లో ఒక విశిష్టమైన మైలురాయి అని మీనా పేర్కొన్నారు. నాగార్జున హీరోగా నటించిన గీతాంజలి చిత్రంలోనటించే అవకాశాన్ని తాను కోల్పోయానని మీనా వివరించారు. ఆ చిత్రంలోమూడు అక్కచెల్లెళ్లలో ఒకరిగా నటించాల్సి ఉండగా, పరీక్షల కారణంగా ఊటీలో 20 రోజుల షూటింగ్‌కు హాజరు కాలేకపోయానని చెప్పారు. తన తల్లి చదువు పూర్తి చేయలేదని బాధపడటంతో, ఆమె ప్రోత్సాహంతో ప్రైవేట్‌గా ఎంఏ చరిత్రను పూర్తి చేసినట్లు మీనా వెల్లడించారు. తాను ఎనిమిదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నానని, అయితే ఎంఏ పూర్తి చేసినందున అక్కినేని నాగేశ్వరరావు కంటే ఎక్కువ చదివినట్లయిందని హాస్యంగా పేర్కొన్నారు. నాగేశ్వరరావు ఐదో తరగతి వరకు చదివి, తనను తాను "ఫిఫ్త్ క్లాస్ పోస్ట్ గ్రాడ్యుయేషన్" అని పిలుచుకునేవారని మీనా గుర్తు చేసుకున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**